
బతుకమ్మ సంబురాల్లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఉద్యోగులు

కలెక్టరేట్‌లో 'బతుకమ్మ'

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్ట రేట్ ఆవరణలో బుధవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకొన్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అద నపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, మహి ళా ఉద్యోగులు గౌరీదేవి, శారదా మాత ప్రతిమ లకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభిం చారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీఆర్‌డీ వో దత్తారావు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు చేయాలి

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కౌటాల: ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు సకాలంలో ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆదేశించారు. కౌటాల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. పాత కార్యాలయ భవనంలోని గదులు పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో భారీ వర్షం కురిసినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన గదులు వినియోగించుకోవద్దని సూచించారు. భవనం పరిస్థితిపై నివేదిక అందించాలని ఆదేశించారు. ధ్రువపత్రాల మంజూరు పెండింగ్‌లో ఉంచి విద్యార్థులు, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ పుష్పలత, డీటీ దిలీప్ తదితరులు ఉన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్' సర్వే వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 7,698 దరఖాస్తులు అందాయని తెలిపారు. సర్వే ప్రక్రియ త్వరగా పూర్తిచేసి తదుపరి కార్యాచరణకు రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో అన్నలు లేనట్లేనా!

- 'ఎల్‌డబ్ల్యూఈ' నుంచి మూడు జిల్లాల తొలగింపు
- కొనసాగించాలంటూ రాష్ట్ర సర్కారు వినతి
- ప్రత్యేక నిధులు, పథకాల అమలు లేనట్లే..
- అడవుల జిల్లాలో 'మావో'లది మరువలేని చరిత్ర


తిర్యాణి అడవుల్లో పోలీసుల కూంబింగ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వామపక్ష తీవ్రవాద ప్రాంతాల జాబితా నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను కేంద్ర హోంశాఖ తొలగించింది. గత కొన్నేళ్లుగా ఇక్కడ మావోయిస్టుల కార్యక్రమాలేవి లేకపోవడం, భద్రత బలగాలు పూర్తి పట్టు సాధించడంతో ఎల్‌డబ్ల్యూఈ(లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రిమిజం ఎఫెక్టెడ్) ప్రాంతాల నుంచి తప్పించింది. గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం కారణంగా ప్రత్యేక పథకాల అమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భద్రత బలగాల పర్యవేక్షణ కొనసాగుతున్నాయి. భవిష్యత్‌లో ఈ కార్యకలాపాలు క్రమంగా తగ్గనున్నాయి.

ప్రత్యేక పథకాలతో నిధులు

దేశంలో నక్సలిజాన్ని తగ్గించేందుకు ఆపరేషన్ 'సమాధాన్', రాష్ట్రంలో 'గ్రేహౌండ్స్' పేర్లతో మావోయిస్టుల ఏరివేత కొనసాగింది. 2010లో 96జిల్లాల్లో 'మావో'ల ప్రభావం ఉండగా, 2021నాటికి 46కు పడిపోయి, తాజాగా 38జిల్లాలకు చేరింది. ఈ నెల 7న వామపక్ష ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాలను వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం లేకపోవడంతో ఎల్‌డబ్ల్యూఈ నుంచి తొలగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. నక్సల్స్ కారణంగా ఎన్నికల సమయంలో ఓటింగ్ గంట ముందే నిలిపివేయడం, అధికారులు, ప్రజాప్రతినిధులకు భద్రత పెంపు, అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో రాష్ట్ర, కేంద్ర బలగాల పహారా, స్థానికులపై ఆంక్షలు అమల్లో ఉంటాయి. దేశంలో 2026నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని తగ్గించేలా కేంద్రం చర్యలు చేపట్టింది.

సమసమాజ స్థాపన లక్ష్యంగా

పేద, ధనిక మధ్య అంతరాలను తొలగిస్తూ భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థలకు వ్యతిరేకంగా ఐదు దశాబ్దాల క్రితం నక్సలిజం పురుడు పోసుకుంది. కార్మిక, కర్షక, రైతాంగ సమస్యల పరిష్కారానికి


ఉమ్మడి జిల్లా నుంచి కీలకంగా పనిచేసిన మావోయిస్టులు(ఫైల్)

విప్లవ పంథాలోనే సమసమాజ స్థాపన సాధ్యమని ఆ పార్టీ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి జిల్లా నుంచి యువత నక్సలిజం వైపు మళ్లారు. మూడు దశాబ్దాలపాటు మావోయిస్టు పార్టీ గిరిజన, మైదాన ప్రాంతాలు, ఇటు సింగరేణి ప్రాంతంలో సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) సంస్థలు విప్లవ బావుటా ఎగురవేశాయి. ప్రజల మద్దతుతో అనేక పోరాటాల్లో పోలీసులపై పైచేయి సాధించారు. లక్సెట్టిపేట, ఇంద్రవెల్లి, ఉట్నూరు, ఖానాపూర్, తిర్యాణి, సిర్పూర్, చెన్నూరు, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, ఆదిలాబాద్, జన్నారం తదితరచోట్ల భీకర పోరాటాలు జరిగాయి. దొరల ఇళ్లపై దాడులు, దోపిడీదారులు, ప్రజాకంటకులను ప్రజాకోర్టులో శిక్షించేవారు. ఆ సమయంలోనే నిరుపేదలకు భూపంపిణీ జరిగింది. బలగాలు, నక్సల్స్‌కు మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం ఉండగా క్రమంగా తగ్గుముఖం పట్టింది.

'కడంబా' ఘటన చివరిది

ఉమ్మడి జిల్లా ఏజెన్సీ ప్రాంతంతోపాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలు, ప్రాణహిత, పెన్‌గంగా, గోదావరి తీర గ్రామాలకు గత పదేళ్లుగా కొత్త రోడ్లు, సమాచార వ్యవస్థతో మౌలిక వసతులు అభివృద్ధి చెందాయి. రూ.కోట్లు వెచ్చించి ఆసుపత్రులు, గిరిజన యువతకు పథకాలు తెచ్చారు. దీంతో నక్సలిజం తగ్గింది. తెలంగాణ ఏర్పడ్డాక కేబీఎం(కుమురంభీం మంచిర్యాల) కమిటీ తిరిగి కార్యకలాపాలు సాగించేందుకు ప్రయత్నించింది. గిరిజన యువతను ఉద్యమం వైపు ఆకర్షించి దళంలో చేర్చుకునే ప్రయత్నం చేసింది. 2020లో కాగజ్‌నగర్ మండలం కడంబా అడవుల్లో భద్రతా బలగాల చేతిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన బాదీరావు మృతిచెందారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర సభ్యుడు అడెల్లు భాస్కర్ పట్టు పెంచే ప్రయత్నాలు చేసినా వీలు కాలేదు. రెండేళ్ల క్రితం ఆయన సహచరి కంతి లింగవ్వ చనిపోయింది. పార్టీ బలోపేతం లక్ష్యంగా మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో ఇంద్రవెల్లి, సిర్పూర్, మంగీ, చెన్నూరు, మంచిర్యాల ఏరియాలకు కొత్త నియామకాలు చేపట్టింది. ఈ కమిటీలు దండకారణ్యం కేంద్రంగానే కార్యకలాపాలు సాగించాయి. కోవిడ్ తర్వాత పలుమార్లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రవేశించే ప్రయత్నాలు జరిగాయి. కానీ నిలదొక్కులేకపోయారు. ప్రస్తుతం కోల్‌బెల్ట్ కమిటీ పేరుతో సింగరేణి కార్మికుల పక్షాన, స్థానిక ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వ్యతిరేకిస్తూ పత్రిక ప్రకటనలు మాత్రం వెలువడుతున్నాయి.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కాటన్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోళ్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024 – 25 సీజన్‌లో జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, సుమారు 23 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521గా నిర్ణయించిందని, జిల్లాలోని 17 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు జిన్నింగ్ మిల్లులను సందర్శించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల్లో పత్తి నిల్వ పేరుకుపోకుండా చూడాలని సూచించారు. రహదారులను ఆనుకుని మిల్లులు ఉన్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. నవంబర్ మొదటి వారంలో పత్తి పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండగా.. నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అష్మద్, పత్తి కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తజన బాసర

- మూలా నక్షత్ర పూజలకు తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణం
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- పోలీసుల భారీ బందోబస్తు


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా/బాసర: చదువుల తల్లి కొలువుదీరిన బాసరలో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అత్యంత శుభ ముహూర్తం, అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్ర పర్వదినాన అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో విజయరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరినది వద్ద వేకువజాము నుంచి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వందల సంఖ్యలో భక్తులు పాదయాత్రగా బాసర చేరుకున్నారు.

గంటలపాటు బారులు..

ఆలయ ప్రాంగణంలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. క్యూలో ఉన్న భక్తులకు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సేవలు అందించారు. భక్తులకు పాలు, మంచినీటి ప్యాకెట్లు అందించారు. భైంసా బృందం భక్తులకు పులిహోర పంపిణీ చేసింది. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన వ్యాపార సంఘం సభ్యులు, బాసర యువకులు ప్రత్యేక సేవలందించారు. అధికసంఖ్యలో భక్తులు రావడంతో అతిథి గృహాలు దొరకక ప్రైవేటు లాడ్జిల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గదులు దొరకక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్షర శ్రీకార మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.


చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న వేదపండితుడు

ప్రత్యేక బందోబస్తు..

ఉత్సవాల్లో భాగంగా బాసర ఆలయ ప్రాంగణంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఒకరోజు ముందుగానే బాసర చేరుకుని భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌తో కలిసి శాంతి భద్రతలపై చర్చించారు. ఉదయం నుంచి బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, గోదావరి స్నానఘట్టాలు, ఆలయానికి వెళ్లే ప్రధాన కూడళ్లలో పోలీసులను మోహరించారు. వాహనాలను ఆలయం వైపునకు అనుమతించలేదు. నిజామాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలకు బాసర గోదావరి, ఆలయానికి మధ్య ఉన్న ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక మహారాష్ట్ర, భైంసా, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆలయానికి వెళ్లే మార్గంలో మరో పార్కింగ్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అక్షరాభ్యాస మండపాల వద్ద పోలీసులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఆదాయం రూ.29,94,850

బాసర: బాసర సరస్వతీమాత ఆలయంలో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అక్షరాభ్యాస పూజలు, వివిధ అర్జిత సేవ టికెట్ల ద్వారా ఆలయానికి రూ.29,94,850 ఆదాయం వచ్చింది. రూ.వెయ్యి అక్షరాభ్యాసం ద్వారా రూ.16,21,000, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రూ.97 వేలు, రూ.150 సాధారణ అక్షరాభ్యాసం ద్వారా రూ.91,350, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రూ.10,050, రూ.100 ప్రత్యేక దర్శనం ద్వారా రూ.2,43,200, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రూ.3,700, రూ.50 మండప ప్రవేశం ద్వారా రూ.21,050, అభిషేకం లడ్డూ ప్రసాదం ద్వారా రూ.4,05,000, చిన్న లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3,12,500, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,64,000, విరాళాలు రూ.16వేలు, రాగి కాయిన్స్ అమ్మకం ద్వారా రూ.8వేల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు తెలిపారు.

అన్నీ.. గేటు బయటే!

- వాహనాల రిజిస్ట్రేషనైనా.. రెన్యూవలైనా కార్యాలయం బయటే..
- ఎండలో వాహనదారులకు ఇక్కట్లు
- ఇదేమని ప్రశ్నించే వారికి చుక్కలు చూపుతున్న అధికారులు
- ఆసిఫాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో వింత పరిస్థితి


ఆసిఫాబాద్ ఆర్టీఏ కార్యాలయం గేటు బయట వాహనదారులు

సాక్షి, ఆసిఫాబాద్: మీరు కొత్తగా ఏదైనా వాహనం కొనుగోలు చేశారా? లేదా పాత వాహనానికి ఫిట్‌నెస్ రెన్యూవల్ చేయించడానికి వెళ్తున్నారా? అయితే ఒక్క క్షణం ఆగండి..! మీరు గొడుగో లేదా టోపీనో తీసుకెళ్లండి? వీలయితే ఓ వాటర్ బాటిల్‌ను సైతం తీసుకెళ్తే మంచిది.. ఎందుకంటే మీరు అక్కడ ఆర్టీఏ అధికారులు మిమ్మల్ని గేటు బయటే నిలబెట్టి.. తీరిగ్గా మీ వాహనాలను తనిఖీలు చేస్తారు.. ఆసిఫాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిత్యం చోటుచేసుకుంటున్న ఈ వింత పరిస్థితిని చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు

జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం. జిల్లా కార్యాలయానికి నిత్యం పదుల సంఖ్యలో కొత్తగా కొనుగోలు చేసిన ద్విచక్రవాహనాలు, లారీలు, ట్రాక్టర్లు, జీపులు, కార్లు రిజిస్ట్రేషన్ కోసం.. ఫిట్‌నెస్ రెన్యూవల్ కోసం వస్తుంటాయి. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)తోపాటు సిబ్బంది ఆయా వాహనాల ఇంజిన్, ఛాసీ నంబర్లను పరిశీలించిన తర్వాత.. ఆ దరఖాస్తులపై ఎంవీఐ సంతకం చేసి ఫైల్‌ను రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పంపుతారు. అలాగే పాత వాహనం ఏదైనా ఫిట్‌నెస్ కోసం వస్తే ఆ వాహనం ఇంజిన్ సామర్థ్యం, టైర్లు, బ్రేకులు, హెడ్‌లైట్లు, సైడ్ ఇండికేటర్ లైట్లు సరిగా పనిచేస్తున్నాయా? లేదా? అని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఎంవీఐ అధికారి సిఫార్సు చేస్తారు. వాహన డ్రైవింగ్ లైసెన్సుల కోసం వచ్చిన అభ్యర్థులు.. తమ సొంత వాహనాలతో డ్రైవింగ్ ట్రాక్‌పై టెస్ట్ రైడింగ్ చూపాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో అభ్యర్థికి రోడ్డు భద్రతా సేఫ్టీ రూల్స్ గురించి కొన్ని ప్రశ్నలు వేస్తారు? వాటికి సరైన సమాధానం చెప్పిన వారిని పరీక్షలో ఉత్తీర్ణత సాధించనట్లుగా సిఫార్సు చేస్తూ ఫైల్‌పై ఎంవీఐ స్థాయి అధికారి సంతకం చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వతే నూతన వాహనానికి రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. అనంతరం ఇతరత్రా పనులు సైతం జరుగుతాయి. ఇంతవరకు అంతా బాగానే ఉన్నా... ఆసిఫాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో మాత్రం వింత వైఖరి కొనసాగుతుండడంతో వాహనదారులు పెదవి విరుస్తున్నారు.


గేటు బయట నిలిపిన వాహనాలు

ఏ పనైనా..

ఆసిఫాబాద్ ఆర్టీఏ కార్యాలయం లోపల విశాలమైన టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌తోపాటు... పదుల సంఖ్యలో వాహనాలు నిలిపేందుకు స్థలం ఉంది. కానీ ఇక్కడి అధికారులు మాత్రం ఇటీవల ఒక్క వాహనాన్ని లోపలికి అనుమతించకపోవడం విడ్డూరంగా ఉంది. 'వాహనం ఏదైనా.. పనేదైనా.. అన్నీ గేటు బయటే' అన్నట్లుగా వారి ధోరణి కనిపిస్తోంది. కార్యాలయం తలుపులు ఉదయం 10.30 గంటలకు తెరిచినప్పటి నుంచి వాహనదారులు బయటే వాహనాలను నిలిపి ఉంచాలని ఆర్టీఏ సిబ్బంది ఆదేశిస్తున్నారు. కేవలం రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకుని చలానాలు కట్టేవారిని మాత్రమే ప్రధాన ద్వారం వద్ద ఉన్న చిన్న ద్వారం నుంచి లోపలికి పంపుతున్నారు. ఇక కార్లు, జీపులు, ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్ర వాహనాలన్నీ గేటు ఎదుట రోడ్డు పొడవునా నిలిపి ఎదురుచూసే పరిస్థితి. ఉదయం నుంచి కార్యాలయంలోనే అధికారులు ఉన్నా.. నెమ్మదిగా మధ్యాహ్నం 12 గంటల తర్వాతగానీ బయటకు వచ్చి వాహనాలను తనిఖీ చేయడం లేదు. ఉదయం వచ్చిన వాహనదారులు ఎండలో వేచిచూస్తున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే మాత్రం వారి వాహనాన్ని చివరి వరకు తనిఖీ చేయకుండా చుక్కలు చూపిస్తున్నారని తెలుస్తోంది. ప్రశ్నించి ఇక్కట్లు పడడం ఎందుకన్న ధోరణి వాహనదారుల్లో కనిపిస్తోంది. బుధవారం మధ్యాహ్నం 'సాక్షి' ప్రతినిధి ఆర్టీఏ కార్యాలయం బయట వాహనాలు ఉంచి ఇంజిన్ నంబరు తదితర వివరాలను ఎంవీఐకి సిబ్బంది చెబుతున్న సందర్భంలో ఫొటోలు తీస్తుండగా.. 'ఎవరు మీరు? ఎందుకు ఫొటో తీశారు?' అంటూ ప్రశ్నించడమే కాకుండా... కార్యాలయంలోకి వెళ్తున్న 'సాక్షి' ప్రతినిధిని సైతం గేటు ముందే నిలబెట్టారు. డీటీవో లేరు..? మీరు లోపలికి వెళ్లేందుకు ముందుగా ఎంవీఐ అనుమతి పొందాలని ఆర్టీఏ కానిస్టేబుల్ వాగ్వాదానికి దిగడం కొసమెరుపు. కార్యాలయం వెలుపల జరుగుతున్న ఈ వింత వైఖరిపై జిల్లా రవాణా శాఖ అధికారి రామచంద్రను 'సాక్షి' వివరణ కోరగా.. 'అలాంటిదేమీ తన దృష్టికి రాలేదు. గేటు బయటే వాహనాలను నిలిపి తనిఖీలు చేసిన సిబ్బంది వివరణ కోరుతా? వాహనదారులకు ఇకపై ఇక్కట్లు కలగకుండా చర్యలు తీసుకుంటాను.' అని తెలిపారు.

15 నుంచి పాదయాత్ర


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ నుంచి ఈ నెల 15 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండ్ర రాజేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాదయాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా ఉద్యమకారులకు సరైన గుర్తింపు లేదని ఆరోపించారు. ఈ నెల 29న ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే సభతో పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు. రాష్ట్ర సాధనలో అమరులైన 1250 మంది కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఫ్రీబస్సు, పింఛన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేశ్, జిల్లా అధ్యక్షుడు ధర్మ, ప్రధాన కార్యదర్శి మోయిన్, నాయకులు రవీందర్, లక్ష్మణ్, వసంత్‌రావు, ఇర్ఫాన్, హరిప్రియ, సింగాడే అశోక్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా పోరాటం చేస్తుండగా.. ఆగస్టులో ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంజన్న, భాస్కర్, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా దుర్గామాత

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయంలో నవరాత్రోత్సవాలు ఆర్భాటంగా సాగుతున్నాయి. బుధవారం కనకదుర్గామాత భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రధా న అర్చకులు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మన్మథ్ గ్రామానికి చెందిన సితర్ల కవిత (32)కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. సోమవారం గుర్తు తెలియని పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త భోజన్న, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(50) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉందని, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని పేర్కొన్నారు. వివరాలకు 8712658596, 9701112343 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గోట్కూరిలో దొంగతనం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై శివరాం

తాంసి: మండలంలోని గోట్కూరి గ్రామంలో గల ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్-లావణ్య దంపతులు రాత్రివేళ శారదాదేవి మండపానికి వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికి తిరిగొచ్చి పడుకున్నారు. రాత్రి నిద్రపోయిన తర్వాత ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఉదయం వేళ బీరువా తెరిచి ఉండటాన్ని గమనించిన దంపతులు దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హమాలీలకు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: దసరా పండుగను అందరు సంతోషంగా జరుపుకోవాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ అదనపు కలెక్టర్ చాంబర్‌లో పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళతో కలిసి హమాలీలకు బోనస్ చెక్కులు, స్వీట్‌బాక్సులు అందజేశారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ పరిధిలోని మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్, కోటపల్లి, బెల్లంపల్లి, తాండూర్‌లోని గిడ్డంగుల్లో పని చేస్తున్న 44మంది హమాలీలకు రూ.6,500 చెక్కు, స్వీట్ బాక్స్ అందించారు.

చలో 'కవ్వాల్' చూసొద్దాం

- సఫారి ప్రయాణం ప్రారంభం
- పచ్చని అడవులు.. స్వచ్ఛమైన వాతావరణం
- కనువిందు చేస్తున్న వన్యప్రాణులు



పర్యాటకశాఖ లగ్జరీ జంగల్ సఫారి



అటవీశాఖ సఫారి ప్రారంభమయ్యే గోండుగూడ గేట్ నం1

జన్నారం: పచ్చదనాన్ని పంచే అడవులు.. స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే చెట్లు.. చెంగు చెంగున ఎగిరే వన్యప్రాణులు, గలగల పారే సెలయేర్లు.. పక్షుల కిలకిల రావాలకు కవ్వాల్ టైగర్ జోన్ చిరునామా నిలుస్తోంది. టైగర్‌జోన్‌కు జన్నారం అటవీ డివిజన్ గుండెకాయ వంటింది. నిత్యం బిజీగా గడిపే వారు స్వచ్ఛమైన వాతావరణం కోసం వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి సేద దీరుతారు. గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన సఫారి ప్రయాణం ఈ నెల 7నుంచి ప్రారంభమైంది. దీంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. జన్నారం అటవీ డివిజన్ పర్యాటక రంగ అభివృద్ధికి, మరిన్ని ప్రాంతాల్లో పర్యాటకులు పర్యటించేలా అటవీశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

బసకు హరిత రిసార్ట్

పర్యాటకులు బస చేసేందుకు జన్నారం మండల కేంద్రంలోని పర్యాటక శాఖ హరిత రిసార్ట్ ఉంది. పర్యాటక, అటవీశాఖల ఆధ్వర్యంలో జంగిల్ సఫారి ఏర్పాటు చేశారు. ఈ సఫారిలో పర్యటిస్తూ కవ్వాల్ అటవీ అందాలు తిలకించవచ్చు. ప్రతీ సంవత్సరం అక్టోబర్ నుంచి జూన్ వరకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇస్తారు. పర్యాటకులను అడవిలో సుమారుగా 15కిలోమీటర్ల దూరం సఫారి ద్వారా తిప్పి అడవి అందాలు, వన్యప్రాణుల సోయగాలను చూపిస్తారు. ఈ ప్రయాణం పర్యాటకులకు మంచి అనుభూతిని కలిగిస్తుంది. పర్యాటక, అటవీశాఖ సఫారీల చార్జీలు పని దినాలు, వారాంతాల్లో వేర్వేరుగా ఉంటాయి.

ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకుల తాకిడి

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అడవి అందాలు, అడవిలో వన్యప్రాణులు చూసేందుకు ఆసక్తి చూపిస్తారు. రాత్రి రిసార్ట్‌లో బస చేసి ఉదయం 6 గంటలకే అడవికి వెళ్లేందుకు వీలుగా సఫారి ఉంటుంది. అడవిగుండా ప్రయాణంలో చుక్కల దుప్పులు, సాంబర్లు, అడవి దున్నలు, నీలుగాయిలు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తాయి. పచ్చని అడవులు, స్వచ్ఛమైన గాలి, వన్యప్రాణుల పరుగులు కొత్త అనుభూతినిస్తాయి. దట్టమైన అడవులు, జలపాతాలు, పక్షుల కిలకిల రావాలు, వన్యప్రాణుల పరుగులు ఆకట్టుకుంటాయి.

ఇలా రావచ్చు

జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటనకు హైదరాబాద్ నుంచి బస్సు, రైలు సౌకర్యం ఉంది. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు రైలు.. అక్కడి నుంచి జన్నారానికి బస్సు సౌకర్యం ఉంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే లగ్జరీ బస్సులు వయా జన్నారంలో ఆగుతాయి. కార్లు, ఇతర వాహనాల్లో వచ్చే పర్యాటకులు హైదరాబాద్ నుంచి కరీంనగర్, మంచిర్యాల మీదుగా లేదా రాయపట్నం, లక్సెట్టిపేట మీదుగా జన్నారానికి చేరుకోవచ్చు. ముందుగానే హరిత రిసార్ట్‌ను టీజీటీడీసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకునే సౌకర్యం ఉంది.

ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సౌకర్యం



సుదూర ప్రాంతాల నుంచి కవ్వాల్ అందాలు చూడడానికి వచ్చే పర్యాటకులు ముందుగా ఆన్‌లైన్ ద్వాగా గదులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. హైదరాబాద్, ముంబయి, ఇతర పట్టణాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారి కోసం ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాం. బసకు కాటేజీలు, పర్యటనకు సఫారి సౌకర్యం ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అడవి ప్రదేశాలు చూడొచ్చు.

– ఎస్.వీరేందర్, మేనేజర్, పర్యాటక శాఖ

పర్యాటకులకు మంచి అనుభూతి



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో దట్టమైన అడవులు, వన్యప్రాణులు, స్వచ్ఛమైన వాతావరణం పర్యాటకులకు మంచి అనుభూతిని కలిగిస్తాయి. గత సంవత్సరంలో తీసుకున్న చార్జీలే ఇప్పుడు తీసుకుంటున్నాం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడి వాతావరణం, వన్యప్రాణులు, అడవులను, పచ్చదనానికి మంత్రముగ్ధులవుతారు.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

పండుగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం
- తల్లీకూతురుకు తీవ్రగాయాలు



సంగెం సురేష్(ఫైల్)



సాయి వర్షిక్(ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నర్సాపూర్(జి): పండుగపూట ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. కాసేపట్లో ఇంటికి చేరుకుంటామనుకున్న తరుణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ తండ్రీ కొడుకులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం మన్మథ్ గ్రామానికి చెందిన సంగెం సురేష్ (28), భార్య ప్రియాంక, కుమారుడు సాయివర్షిక్ (6), కుమార్తె తనిష్క మంగళవారం కారులో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్‌లో గల అత్తగారింటికి వెళ్లారు. బుధవారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. నర్సాపూర్ (జి) మండలంలోని తురాటి గ్రామ సమీపంలో 61వ జాతీయ రహదారిపైకి చేరుకోగానే కారు టైరు పేలడంతో రోడ్డుపక్కనున్న చెట్టును ఢీకొట్టింది. బుధవారం ఉదయం కారు ముందు టైరు పేలడంతో రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొంది. ఘటనలో సాయి వర్షిక్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలైన సురేష్, ప్రియాంక, తనిష్కలను 108లో నిర్మల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి సురేష్ మృతి చెందాడు. ప్రియాంకను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. సురేష్ అత్త ముచ్చర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



కైరిగూడలో సీసీరోడ్డు పరిశీలిస్తున్న బృందం

తాంసి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం కేంద్ర బృందం సభ్యులు భీంపూర్ మండలంలో పర్యటించారు. నేషనల్ మానిటరింగ్ బృంద సభ్యులు రఘునాథ్, నాగరాజు మండలంలోని కైరిగూడ, గుంజాల గ్రామాలను సందర్శించి పనులు పరిశీలించారు. ఉపాధిహామీ, సీసీ రోడ్లు, నర్సరీ, ప్రకృతివనం, ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న ఇళ్ల సంఖ్య, జాబ్ కార్డులు, కూలీల సంఖ్య, కల్పించిన పని దినాలు, చెల్లించిన పేమెంట్ తదితర వివరాలు తెలుసుకున్నారు. కైరిగూడలో ఉపాధిహామీ నిధులు రూ.6లక్షలతో వేసిన సీసీ రోడ్డును పరిశీలించి, పని వివరాలకు సంబంధించిన బోర్డ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని పంచాయతీరాజ్ ఏఈని ప్రశ్నించారు. కమిటీ సభ్యుడు రఘునాథ్ మాట్లాడుతూ ప్రతీ జిల్లాలోని నాలుగు మండలాల్లో పనులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కొన్ని చోట్ల పనులు బాగా చేపట్టారని, మరికొన్ని చోట్ల పనులు అధ్వానంగా ఉన్నాయన్నారు. పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీడీ కుటుంబరావు, మధుసూదన్, ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఏపీవో సంగీత, డీటీ హరిదాస్, ఈసీ నరేందర్, ఏపీఎం ప్రసాద్, ఏఈవో శంకర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు మజర్, అనసూయ, దేవన్న, ఫీల్డ్ అసిస్టెంట్ వసంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కేశవ్‌గూడలో..

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి, వజ్జర్, కేశవ్‌గూడ గ్రామ పంచాయతీల్లో కేంద్రం పథకాల అమలు తీరును జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ బృందం సభ్యులు రఘునాథ్, నాగరాజు బుధవారం పరిశీలించారు. పంచాయతీలకు వెళ్లి పథకాల అమలుతీరు తెలుసుకున్నారు. ఐదేళ్ల క్రితం పిప్పల్‌ధరి గ్రామంలో నిర్మించిన రోడ్డు కొలతలను నమోదు చేసుకున్నారు. ఉపాధిహామీ అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు, ఈజీఎస్ ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో జీవన్‌రెడ్డి ఉన్నారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి



పొలంలో పడిపోయిన ఆటో



ఆస్పత్రిలో ఉమ మృతదేహం

లక్ష్మణచాంద(నిర్మల్): ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన రాచాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని పొట్టపెల్లి కే గ్రామానికి చెందిన సొనాడం ఉమ (46), గుండం లలిత బుధవారం ఉదయం వడ్యాల్ గ్రామీణ బ్యాంకుకు డబ్బుల కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మల్లాపూర్ గ్రామానికి చెందిన షాదుల్లా అనే వ్యక్తి ఆటో ఎక్కి వస్తుండగా రాచాపూర్ సమీపంలో చెరువు కట్టపై ఆటో అదుపుతప్పి చెరువు కట్ట కిందకు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఉమ ఛాతిపై ఆటో పడడంతో బలమైన గాయాలయ్యాయి. లలిత, ఆమె కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఉమ మృతి చెందింది. మృతురాలికి భర్త భీమన్న, ఇద్దరు కుమారులు ఉన్నారు. భీమన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు షాదుల్లాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

కలిసిరాని డ్వాక్రా రుణం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు రుణాలు అందజేస్తోంది. అయితే గతేడాది ఉమకు సంఘంలో రూ.2 లక్షలు రాగా కుమారుడికి అనారోగ్యానికి ఖర్చుచేసింది. ఇప్పుడు మళ్లీ రూ.20 వేలు బ్యాంకు నుండి తీసుకోవడానికి వెళ్లగా తిరిగిరాని లోకాలకు వెళ్లిందని, డ్వాక్రా డబ్బులు కలిసిరాలేదని కాలనీవాసులు చర్చించుకున్నారు.

'సింగరేణికి బకాయిలు చెల్లించాలి'

బెల్లంపల్లి: సింగరేణి సంస్థకు బకాయి పడ్డ రూ.34 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. రాజకీయ జోక్యంతో గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు మళ్లించిందని, కరోనా, మెడికల్ ఫండ్, సీఎస్ఆర్ నిధుల పేరిట ధారపోసిందని విమర్శించారు. ఆ నిధులను కొత్త గనుల విస్తరణకు ఖర్చు చేయకుండా దుబారా చేసిందని పేర్కొన్నారు. హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ గని ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.రాజిరెడ్డి నాయకులు సుదర్శన్, శేఖర్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో బతుకమ్మ



చిరుధాన్యాలతో చేసిన బతుకమ్మ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కిషోర బాలికలు వినూత్న రీతిలో చిరుధాన్యాలతో బతుకమ్మ పేర్చారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధ పాల్గొన్నారు.

ఫర్నిచర్ కలప పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ జన్నారం రేంజ్ అలీనగర్ బీట్‌లో అక్రమంగా తయారు చేసిన రూ.54వేల విలువైన ఫర్నిచర్(బాక్స్‌బెడ్) కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. రేంజ్ అధికారి సుష్మారావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్రం నగేశ్ ఇంట్లో డీఆర్వో తిరుపతి, సెక్షన్ అధికారి కిరణ్మయి సిబ్బందితో తనిఖీ చేశారు. బాక్స్‌బెడ్ కలపను స్వాధీనం చేసుకుని డివిజన్ కేంద్రంలోని టింబర్ డిపోకు తరలించారు. ఈ దాడిలో అటవీశాఖ సిబ్బంది శివకుమార్, మధుకర్, భోజన్న, లాల్‌బాయి, తన్వీర్ పాషా, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అధికారికి సంబంధించినదా..?

అలీనగర్ గ్రామంలోని ఆత్రం నగేశ్ ఇంట్లో లభించిన ఫర్నిచర్ కలప మండల కేంద్రానికి చెందిన ఓ అధికారికి సంబంధించినదిగా ఆరోపణలు వస్తున్నాయి. అటవీ అధికారులకు తెలిసే ఈ తతంగం జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నిబంధనకు విరుద్ధంగా కోర్ ఏరియాలో ఫర్నిచర్ తయారు చేయడంపై పూర్తి విచారణ జరిపితే నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని తనిఖీ చేయగా మహారాష్ట్రకు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు డ్రైవర్ ధరణి సంతోష్ తెలిపినట్లు పేర్కొన్నారు. బియ్యం విలువ రూ.1,01,480 ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఎస్సై లచ్చన్న, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని గెర్రె కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గెర్రెకాలనీలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఐటిపాముల బాన్నాయ, దెబ్బెట సతీష్, నెవ్వెవూరి సతీష్, ఈరవేన పోచయ్య, ఒలపు మహేష్, ఈర్ల శంకర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

గుల్లకోటలో..

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని మునయ్య ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం దాడి చేసినట్లు తెలిపారు. రూ.3500 నగదు స్వాధీనం చేసుకుని, చిందం మునయ్య, పెట్టెం సురేష్, తిర్రి రవి, గంగాధరి లింగయ్య, బూరే భీమయ్య, మంగెలపల్లి సత్తయ్య, లెక్కల రవి, మోటపలుకుల శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు గ్లోబల్ సమ్మిట్ పార్టిసిపేషన్



సర్టిఫికెట్ అందుకుంటున్న నారాయణ్‌రావు

భైంసాటౌన్: ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ గ్లోబల్ సమ్మిట్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు. రాజస్థాన్‌లోని బ్రహ్మకుమారీస్ శాంతివనంలో క్లీన్-హెల్తీ సొసైటీ కోసం ఆధ్యాత్మికతపై ఈనెల 4 నుంచి 7 వరకు గ్లోబల్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీసమేతంగా హాజరయ్యారు. ఈ మేరకు బుధవారం ముగింపు సందర్భంగా బ్రహ్మ కుమారీస్ చీఫ్ రాజయోగిని డా.రతన్ మోహిని దాదీజీ చేతుల మీదుగా గ్లోబల్ సమ్మిట్-2024 పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ప్రసాదం అందుకున్నారు.

జేఎంఈటీ ఫలితాల్లో నస్పూర్ వాసి ప్రతిభ



తల్లిదండ్రులతో మహేందర్

నస్పూర్: సింగరేణి సంస్థలో అధికారిగా ఉద్యోగం సాధించాలన్న తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనే లక్ష్యంతో కష్టపడి చదివి రెండు ఉద్యోగాలు సాధించాడు నస్పూర్ వాసి నలవల మహేందర్. ఆర్జీ 3 ఓసీపీ 2లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ నస్పూర్‌లోని షిర్కే కాలనీలో నివాసం ఉండే నలువల తిరుపతి, తారా దంపతుల కుమారుడు మహేందర్ సెప్టెంబర్‌లో విడుదల చేసిన ఎంజీటీ(మైనింగ్ గ్రాడ్యుయేషన్ ట్రైనీ) ఫలితాల్లో 26వ ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదల చేసిన జేఎంటీ(జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ) ఫలితాల్లో 2వ ర్యాంకు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కి అర్హత సాధించి మెయిన్స్‌కి సిద్ధం అవుతున్నాడు. మహేందర్ ప్రస్తుతం పుణేలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సింగరేణిలో రెండు ఉన్నతమైన ఉద్యోగాలు సాధించడంపై కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొలుసు దొంగల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: చెన్నూర్‌లో ఇద్దరు గొలుసు దొంగలను పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక పద్మశాలి కాలనీకి చెందిన వృద్ధురాలు రాజుభాయి శివాలయం నుంచి పద్మశాలి కాలనీకి వస్తుండగా ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గోపితాడును లాక్కుని పారిపోయారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించామని అన్నారు. మంగళవారం రాజీవ్‌రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారని తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని బట్టిగూడెం కాలనీకి చెందిన నెన్నల సూర్య, జిట్టబోయిన సంతోష్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేశామని తెలిపారు. వారి నుంచి రెండున్నర తులాల బంగారు గోపితాడు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని అన్నారు. ఈ కేసును మూడు రోజుల్లో ఛేదించిన సీఐ రవీందర్, ఎస్సై శ్వేత, కానిస్టేబుల్ భూమన్న, హోంగార్డు ఖదీర్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

కొలాం సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగారాం



ఆత్రం గంగారాం

తిర్యాణి(ఆసిఫాబాద్): కొలాం సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిర్యాణి మండలానికి చెందిన ఆత్రం గంగారాం నియమితులయ్యారు. ఉట్నూర్‌లోని కొలాం భవన్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొలాం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ఐక్యంగా ఉద్యమిస్తామని గంగారాం పేర్కొన్నారు.

ఒక్కో సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. బుధవారం కాల్‌టెక్స్ ఏరియాలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేరాల అదుపులో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో తోడ్పడుతోందని అన్నారు. సంఘ విద్రోహ శక్తుల కదలికలను పసిగట్టడంలో నిఘా నేత్రాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. బస్తీలు, ఇళ్లు, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్,వ్యాపార, వాణిజ్యవర్గాలు, ప్రజలు పాల్గొన్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



కార్గోసేవలపై అవగాహన ర్యాలీ

మంచిర్యాలఅర్బన్: టీజీఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్, నిజామాబాద్ కార్గో మేనేజర్ బి.పాల్ అన్నారు. బుధవారం మంచిర్యాలలో కార్గో సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మరింత వేగంగా, భద్రంగా సరుకులు రవాణా చేయడానికి కార్గో విభాగం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గృహ అవసరాలు, వ్యాపార అభివృద్ధికి కార్గో సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సేవలు మరింత చేరువయ్యేలా ప్రతీ మండలంలో ఒక కార్గో ఏజెంటును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిపో మేనేజర్ జనార్ధన్, సేల్స్‌టీం సభ్యులు సాయన్న, మహేష్, రమేష్, అశోక్‌రావు పాల్గొన్నారు.